క్లుప్తంగా

శ్రీవిద్యకు బంగారు పతకాలు



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న శ్రీవిద్య

మడకశిరరూరల్: మడకశిర వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థిని జానపాటి శ్రీవిద్య రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ సరోజినీదేవి తెలిపారు. ఈ నెల 24న విజయవాడలోని స్వర్ణ భారతీ ట్రస్టులో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం 57వ స్నాతకోత్సవాలు నిర్వహించారు. ఇందులో రాష్ట్రస్థాయిలో వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబరచిన విద్యార్థిని జానపాటి శ్రీవిద్యకు గవర్నర్ అబ్దుల్ నజీర్, విశ్వ విద్యాలయ ఉపకులపతి శారదా జయలక్ష్మీ చేతుల మీదగా రెండు బంగారు పతకాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.

ఫన్నీ టిట్ బుక్స్ ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఎంఈఓలు

పరిగి: ప్రముఖ రచయిత, విశ్రాంత ఉపాధ్యాయురాలు రచించిన ఫన్నీ టిట్ బుక్స్‌ను సోమవారం మండల విద్యాధికారులు లక్ష్మీదేవి, శేషాచలం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు సమాజంపై అవగాహనతో పాటు చదువుపై ఆసక్తిని పెంచేందుకు పుస్తకాలు తోడ్పడుతాయన్నారు. ఫన్నీ టిట్ బుక్స్‌ను ప్రింటింగ్ చేసి మండలంలోని అన్ని పాఠశాలలకు ఉచితంగా అందించేందుకు పూర్వ విద్యార్థి రామకృష్ణ ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి



నిరసనకారులతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ

పరిగి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న ప్రశాంతి నగర్‌లో నెల రోజులుగా నీటి సమస్య ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకుని అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ధర్నా చేశారు. మూడురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని, ఈలోపు ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని ఈఓఆర్డీ, సెక్రటరీలు విజయభాస్కర్, సంజప్ప హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు మున్నా తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

హిందూపురం: భర్త వేధింపులు తాళలేక యాస్మిన్ (27) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి షర్ఫీస్ వివరాలమేరకు.. ఏడాది క్రితం మడకశిరకు చెందిన యాస్మిన్‌కు తూమకుంట చెక్‌పోస్టు వద్ద నివాసం ఉంటున్న స్టోర్ డీలర్ దాదాపీర్‌తో రెండో వివాహమైందన్నారు. పెళ్లయినప్పటి నుంచి భర్త దాదాపీర్ రోజూ వేధిస్తున్నాడన్నారు. ఈ నేపథ్యంలోనే ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. హిందూపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాది చంద్రమౌళికి నివాళి



చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మడకశిర: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది చంద్రమౌళి చిత్రపటం వద్ద సోమవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఆయన మూడేళ్ల క్రితం మృతి చెందారు. ఈనేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం న్యాయవాది వృత్తికి సంబంధించిన పుస్తకాలను మృతుడి సతీమణి భ్రమరాంబ, సోదరుడు మంజునాథ్, కుమార్తె శృతి, కుమారుడు నందీశ్, మాజీ సర్పంచు గాయిత్రి తదితరులు బార్ అసోసియేషన్‌కు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశ్వత్థనారాయణ, మాజీ మంత్రి నర్సేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కాడెద్దులు



- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల ఆసక్తి
- ఎద్దుల స్థానంలో ట్రాక్టర్లు, యంత్ర పరికరాలతో పనులు
- ఖర్చు, సమయం ఆదా అవుతోందంటున్న అన్నదాతలు

అమరాపురం: వ్యవసాయమంటే రైతులకు గుర్తు వచ్చేది ఎద్దులు. గతంలో రైతులు వ్యవసాయం కోసం ప్రతి ఇంట్లో జత ఎద్దులను కలిగి ఉండేవారు. అయితే ప్రస్తుతం అన్నదాతలందరూ ఆధునిక వ్యవసాయ యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎద్దులు కనుమరుగవుతున్నాయి.

గతంలో ఎద్దులకు డిమాండ్

గతంలో ఎద్దులులేని రైతుల ఇళ్లు ఉండేవి కాదు. ఎద్దులు లేని రైతులు ఇతర రైతుల నుంచి బాడుగ చెల్లించి తీసుకునేవారు. దీంతో గతంలో ఎద్దులకు విపరీతమైన డిమాండ్ ఉండేది. విత్తనాలు, గుంటకలు తోలడానికి రూ.2 వేలు తీసుకునేవారు. రాను రాను రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులకు అలవాటు పడ్డారు. దీంతో పొలం దుక్కి దున్ని, చదును చేయడం, విత్తనాలు వేయడం, కలుపు తొలగించడం తదితర వాటిని ట్రాక్టర్లు, యంత్ర పరికారాలతో చేయడం ప్రారంభించారు. దీంతో కాడెద్దులు గ్రామాల్లో కనుమరగవుతున్నాయి.

సేద్యం ఖర్చు తగ్గించుకునేందుకే...

ప్రస్తుతం ఎక్కడ చూసినా ట్రాక్టర్ ద్వారా ఎక్కువగా పనులు చేయిస్తున్నారు. దీంతో కాడెద్దులకు డిమాండ్ తగ్గిపోతుంది. ముఖ్యంగా ట్రాక్టర్ ద్వారా సేద్యం చేయడం ఖర్చు తక్కువ, సమయం కూడా ఆదా అవుతుంది. అలాగే ఎద్దులు ప్రస్తుతం ఒక జత ఎద్దు రూ.లక్ష నుంచి ఒకటిన్నర లక్ష వరకు మార్కెట్లో పలుకుతున్నాయి. దీంతో వాటిని కొనుగోలు చేయాలంటే రైతులకు ఇబ్బందిగా మారింది. వాటి పోషణ కోసం ఎండు గడ్డి ట్రాక్టర్ లోడు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు పలుకుతోంది. వాన కాలంలో పచ్చగడ్డి వేస్తేనే అవి తింటాయి. దీంతో చాలా మంది రైతులు గ్రామాల్లో కాడెద్దులకు బదులు యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. ప్రస్తుతం 90 శాతం మంది రైతులు దుక్కి దున్ని, విత్తనాలు వేయం తదితర వాటిని యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ఒక ఎకరా భూమిని కాడెద్దులతో దున్నాలంటే గంటల తరబడి పడుతుంది. అదే ట్రాక్టర్ ద్వారా గంటలో దున్ని పెడుతుంది. దీంతో రైతులు కాడెద్దులకు స్వస్తి చెప్పి యంత్రాలతో పనులకు మొగ్గు చూపుతున్నారు.



అమరాపురంలో భూమిని ట్రాక్టర్‌తో చదును చేస్తున్న దృశ్యం

యంత్రాలతో పని సులభం



మాది ఉమ్మడి కుటుంబం అప్పుడు మాకు 15 ఎకరాల పొలం ఉండేది. నేను రెండు జతల ఎద్దులను పోషించే వాడిని. వాటితోనే పొలం దుక్కి దున్ని విత్తనాలు వేయడం, పంటను ఎడ్ల బండ్లలో ఇంటికి చేర్చే వాడిని. నాడు తక్కువ కూలీకి కూలీలు దొరికేవారు. దీంతో అన్ని పనులను ఎద్దులతో చేసేవాడిని. ఇప్పుడు కూలీలు దొరకడం కష్టంగా మారింది. దొరికినా అధిక కూలీ చెల్లించాలి. కూలీ డబ్బులకు యంత్రాల ద్వారా పని అయిపోతుంది. పనులు యంత్రాల ద్వారా సులభంగా అవుతుంది.

–ఉమాపతి, రైతు, అమరాపురం

పశుపోషణ భారం ఎక్కువ



కాడెద్దులతో వ్యవసాయం రైతుకు భారమవుతోంది. ఎద్దులతో ఒక రోజు చేసే పని ట్రాక్టర్‌తో రెండు గంటల్లో పూర్తవుతోంది. అదికూడ ఎద్దుల పోషణ కష్టమవుతోంది. దీంతో కాడెద్దులకు స్వస్తి పలికాను. గతంలో ఓ జత ఎద్దులు ఉండేవి. ప్రస్తుతం గ్రామాల్లో ఎద్దులతో వ్యవసాయం చేసే వారు అరుదు. యంత్రాలతోనే పొలం పనులు చేస్తున్నాము.

– మంజునాథ, హేమావతి, అమరాపురం మండలం

ఎద్దులంటే రూ.లక్షపైనే పెట్టాలి



గతంలో రెండు జతల ఎద్దులు ఉండేవి. వాటి పోషణ కోసం ఉదయం లేచి పొలాలకు వెళ్లి పచ్చగడ్డి తెచ్చేవారము. వాటి పోషణ చాలా కష్టం. అది కూడా ప్రస్తుతం మంచి ఎద్దులు ఒకటిన్నర లక్షకు పైగానే పలుకుతాయి. దీంతో గత పది సంవత్సరాల నుంచి కాడెద్దులను పోషించడం భారంగా మారి అమ్మేశాను. ప్రస్తుతం ట్రాక్టర్ ద్వారా పనులు చేసుకుంటున్నా.

– ప్రకాష్ , తమ్మడేపల్లి, అమరాపురం మండలం

రేపు రొళ్లలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

రొళ్ల: మండలంలోని హులికుంట, రొళ్ల, బీజీ హళ్లి, మల్లినమడుగు పంచాయతీ కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పి అనంతరాజు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవతం చేయాలన్నారు.

డిగ్రీ కళాశాలలో పుస్తకావిష్కరణ

మడకశిర: స్థానిక ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆంగ్ల అధ్యాపకుడు చంద్రశేఖర్‌నాయక్ రాసిన నూతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమలత, అనిల్ కుమార్, సులోచన, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనపర్చిన విద్యార్థులు

హిందూపురం: మంగళగిరిలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో హిందూపురంలోని సిప్ అకాడమీ నిర్వాహకులు గోపాల్ ఆధ్వర్యంలో హిందూపురం విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు తెలిపారు. హిందూపురం నుంచి 42 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా వారిలో 38 మంది వివిధ విభాగాల్లో బహుమతులు అందుకున్నారని చెప్పారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సిప్ అబాకస్ నిర్వాహకులు మాలతీ కిషోర్ కుమార్ అభినందనలు తెలియజేశారు.

వికసించిన బ్రహ్మకమలాలు

పరిగి/హిందూపురం/పెనుకొండ/చిలమత్తూరు: పరిగి మండలంలోని కొడిగెనహళ్లిలో నారాయణ స్వామి అనే వ్యక్తి ఇంట్లో బ్రహ్మకమలాలు వికసించాయి. అలాగే హిందూపురం పట్టణం 10వ వార్డులో నివాసం ఉంటున్న మటన్ బాలు నాయక్, లీలాబాయిల ఇంట్లో ఆదివారం బ్రహ్మకమలం మొక్కకు 10 పూలు విరిశాయి.దీంతో చుట్టు పక్కల వాసులు తరలి వచ్చి ఆసక్తిగా చూసి పూజలు చేశారు. పెనుకొండ పట్టణంలో సోమవారం ఉదయం ఏజీపీ భాస్కరరెడ్డి ఇంట్లో బ్రహ్మ కమలాలు విరబూశాయి. చిలమత్తూరు మండల పరిధిలోని కొడికొండలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రామచంద్రారెడ్డి ఇంట్లో బ్రహ్మ కమలాలు విరిశాయి. ఒకే కొమ్మకు ఆరు బ్రహ్మ కమలాలు విరిసినట్లు ఆయన పేర్కొన్నారు.



హిందూపురంలో వికసించిన బ్రహ్మ కమలాలు

సాగు భూములు ఇచ్చేదిలేదు



ధర్నాలో పాల్గొన్న రైతులు

సోమందేపల్లి: ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూములను స్వాధీనం చేసుకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని తుంగోడు గ్రామ పంచాయితీ పరధిలోని సర్వే నెంబరు 28లో 150 కుటుంబాలు సాగులో ఉన్నాయని, అయితే ప్రభుత్వం పరిశ్రమలకు వందల ఎకరాల భూమి స్వాధీనం చేసుకోవడం తగదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో తాము పంటలు సాగు చేస్తున్నట్లు నమోదైందని కాబట్టి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్ హామీ ఇచ్చారు.

ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం



దీపికను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని నింకంపల్లి రోడ్డులోని యల్లమ్మదేవి ఆలయంలో మంగళవారం నిర్వహించనున్న ఆలయ వార్షికోత్సవానికి రావాలంటూ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపికను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం ఆహ్వాన పత్రిన అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పీటీ రమేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి ఆశా వర్కర్ పోస్టు !

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలంలోని బీరేపల్లి పంచాయతీలో ఆశా వర్కర్ పోస్ట్‌ను టీడీపీ నేతలు, అధికారులు అమ్మకానికి పెట్టేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బీరేపల్లిలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్ట్‌కు ముగ్గురు బీసీ మహిళలు పోటీ పడ్డారు. వారిలో స్వాతి అనే మహిళకు ఇంటర్వ్యూలో 75 శాతం మార్కులు రాగా, టీడీపీ మద్దతు తెలిపిన మరో మహిళకు 31 శాతం మాత్రమే మార్కులు సాధించింది. అయితే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత రూ.70 వేలు లంచం తీసుకొని ఆ ఉద్యోగాన్ని ఆమెకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని స్థానిక టీడీపీ నేతలే చెబుతున్నారు. ఓ టీడీపీ నేత వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తోందంటూ కొందరు టీడీపీ నేతలు సమావేశమైన వీడియో వైరల్ అయింది.

కరుణించు వరుణ దేవా..



బొడ్రాయికి జలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని చందకచెర్లు గ్రామ మధ్యలో వెలసిన బొడ్రాయికి సోమవారం వర్షం కోసం ప్రజలు 101 బిందె నీటితో అభిషేకం చేసి కరుణించు వరణు దేవుడు అంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంజినేయ స్వామి, బీరప్ప, పాతలింగప్ప,గంగమ్మ, యల్లమ్మ, మారెమ్మ, చౌడేశ్వరి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో అవసరమైన సమయంలో డ్రైవర్లుగా (ఆస్కాల్) డ్రైవర్లుగా విధులు నిర్వహించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిపో మేనేజర్ రంగ భాష్యం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్స్ కలిగి కనీసం 18 నెలల అనుభవం, ఆర్టీఓ కార్యాలయంలో క్లియరెన్స్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ కలిగి 45 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులన్నారు. ఈ నెల 30వ తేదీలోపు డిపో మేనేజర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సహకార సంఘం అధ్యక్షుడిగా గణేష్

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మండల వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా విరుపసముద్రం గణేష్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే డైరెక్టర్లుగా దాదాపీర్, ధనుంజయలచేత కూడా సీఈఓ గురుమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నూతన అధ్యక్షుడిని అభినందించారు.

గుడిబండ: స్థానిక మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా దిన్నేహట్టికి చెందిన మద్దనకుంటప్ప, డైరెక్టర్లుగా ప్రకాష్, సన్నలింగప్ప సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే ఎమ్ఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పరిగి: మండలంలోని జంగాలపల్లి శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.20,580 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. నిందితులను కోర్టు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రామారావు

రొళ్ల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి ఆగస్టు 25 వరకూ వ్యక్తిగత కారణాలతో సెలవపై వెళ్లారు. దీంతో అమరాపురం మండలం ఎంపీడీఓ పని చేస్తున్న రామారావును ఇన్‌చార్జ్‌గా నియమించారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థినులకు యూనిఫామ్స్ వితరణ

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ముద్దిరెడ్డిపల్లికి చెందిన రోజా సిల్క్స్ సంస్థ అధినేత నాగరాజు విద్యార్థినులకు యూనిఫామ్స్ వితరణ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ అధ్యక్షతన దాత నాగరాజు చేతుల మీదుగా 60 మంది పేద విద్యార్థినులకు ఉచితంగా యూనిఫాంను అందించారు. అలాగే ఐదు మంది పేద విద్యార్థినులకు అడ్మిషన్ ఫీజు చెల్లించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పునాతన రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం దొడ్డబేలేకి చెందిన ముని నరసమ్మ, నరసప్ప కుటుంబ సభ్యులు సోమవారం రూ.50 వేలు విరాళం అందజేసినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

వివిధ సమస్యలపై 16 అర్జీలు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారానికై 16 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ ఆనంద్ కుమార్ తెలిపారు.

'నన్ను ఏమార్చి సంతకం పెట్టించారు'

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు సమీపంలో పరిశ్రమ ఏర్పాటుకు తనను ఏమార్చి రెవెన్యూ అధికారులు సంతకం పెట్టించారని సర్పంచ్ గంగమ్మ తెలిపారు. సోమవారం గ్రామంలో ఆమె గ్రామస్తులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 28 సర్వే నంబర్ లలోని ఇనామ్ భూమిలో వందలాది మంది రైతులు పంట పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం వీఆర్ఓ అంజి తదితరులు తన వద్దకు వచ్చి విద్యుత్ టవర్ల ఏర్పాటు కోసమని చెప్పి పత్రంలో సంతకాలు తీసుకున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: ఆగస్టు 4, 5, 6 తేదీల్లో నంద్యాలలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు బాబావలి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక బీసీ కళాశాల వసతి గృహంలో పోస్టర్లను విడుదల చేశారు.

అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేయాలి



రైల్వేస్టేషన్ టికెట్ కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

హిందూపురం టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని సీపీఐ హిందూపురం కార్యదర్శి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఉదయం బెంగళూరు ప్యాసింజర్, గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లు రెండు ఒకే సమయానికి బయలుదేరుతాయని, ఉద్యోగాల రీత్యా రోజూ ఎక్కువ మంది హిందూపురం నుంచి బెంగళూరుకు వెళ్తున్నారన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- 'కూటమి' మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

రొళ్ల: 'ముఖ్యమంత్రి చంద్రబాబు మోసానికి బ్రాండ్ అంబాసిడర్. కూటమి ప్రభుత్వ మోసాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకుళ్దాం. వైఎస్సార్‌సీపీ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేద్దాం' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని కాకి, రత్నగిరి, గుడ్డగుర్కి పంచాయతీ కేంద్రాల్లో 'బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన ఆయా పంచాయతీ కేంద్రాల్లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ కూటమి సర్కార్ ఏర్పడి దాదాపు 14 నెలలు కావస్తున్న ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. 14 నెలల కూటమి పాలనలో ప్రజలు వంద శాతం వేతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే అధి సాధ్యమవుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. పంచాయతీ స్థాయిలో ఏర్పాటు చేయనున్న కమిటీల్లో అందరికి సముచిత న్యాయం కల్పించడానికి పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చిన కూడా పార్టీ నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, రాష్ట్ర యాక్టివిటీ ఆర్గనైజర్ కమిటీ సభ్యుడు వజ్ర భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ మంత్రి అచ్చెనాయుడు ఆడబిడ్డ నిధి అమలు చేస్తే రాష్ట్రాన్ని అమ్మేయాల్సి ఉంటుందని చెప్పడం కూటమి ప్రభుత్వం దివాళా కోరుతనానికి నిదర్శనం అన్నారు. చేతకానప్పుడు హామీలు ఎందుకిచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వక్కలిగ అనుబంధ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడు, జిల్లా కార్యదర్శి లోకేష్, తాలూకా బూత్ కమిటీ కన్వీనర్ మల్లికార్జునగౌడ, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ నరసింహామూర్తి, ఈసీ మెంబర్ రఘువీర్, సర్పంచులు చిన్నరంగప్ప, హరిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నాగేంద్ర, విజయరంగేగౌడ, మహిళ నాయకురాలు అంజలి, వైస్ సర్పంచులు నాగప్ప, సీఎం ఘట్ట రవి, ఎంపీటీసీలు జగదీష్, లింగరాజు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రత్నగిరిలో మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

అగళి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేస్తున్నారో తెలియజేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, రాష్ట్ర యాక్టివిటీ ఆర్గనైజర్ కమిటీ సభ్యుడు వజ్ర భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం మండల పరిధిలోని ఇనగలూర్, కోమరేపల్లి ,మధూడి పంచాయతీలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చంద్రబాబు సంతకంతో బాండ్లు ఇచ్చి మరీ మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కార్యక్రమంలో మజీ మంత్రి నర్సేగౌడ్, పార్టీ మండల పరిశీలకులు సాయిలీల, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, మజీ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బీదురమ్మ చంద్రప్ప, సర్పంచులు శివకుమార్, ముద్దరాజు, కృష్ణప్ప, బసవరాజు, జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ జయకుమార్, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు జయరామప్ప తదితరులు పాల్గొన్నారు.



అమరాపురం: మాట్లాడుతున్న రాష్ట్ర యాక్టివిటీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు వజ్ర భాస్కర్‌రెడ్డి



అగళి: మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సైనికుల్లా పని చేయండి

అమరాపురం: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడానికి గ్రామాల్లో కమిటీలు నియమిస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యాక్టివిటీ ఆర్గనైజర్ కమిటీ సభ్యుడు వజ్ర భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మద్దనకుంట, తమ్మడేపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మడకశిర నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని గ్రామాల్లో కమిటీలను వేసి పార్టీని మరింత బలోపేతం చేయాడానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిజమ్మ సదానందగౌడ, వైస్ ఎంపీపీ రంజిత్‌కుమార్, ఎంపీటీసీ నారాయణ, ఎంపీపీ ఈరన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, నియోజకవర్గం ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షుడు శివన్న, శివకుమార్, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు వీరక్యాతరాయ, గగన, మాజీ మండల కన్వీనర్ అనిల్‌కుమార్, సర్పంచు గోవిందప్ప, సీనియర్ నాయకులు యువరాజు, పుట్టలింగప్ప, సిద్దేశ్వర, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.